పోతుంది. శ్రవణసుభగం కాని పద్యం కన్న వచనమే వాంఛనీయము. గద్యధోరణికీ, పద్యధోరణికీ తగినంత తారతమ్యం ఉంటేనే స్వారస్యము. ఆంధ్రపద్యం ప్రాయికంగా కర్తృకర్మక్రియా సరణిలో సాగుతూ ఉంటుంది. ఆ విధానంలో సారళ్యమూ ఉన్నది, చప్పదనమూ ఉన్నది. అయితే పద్యాన్ని గద్యగతిలోనే పట్టుపట్టి నడిపిన భావుకుల ప్రయత్నమేమో గ్రహించడంకూడా కర్తవ్యమే.

Wordsworth's Lyrical Ballads పీఠిక చదివి, నేను ౧౯౨౦ సంవత్సరంలో పద్యము గద్యములాగ ప్రయత్నపూర్వకంగా పోనిచ్చాను. మామూలు మాదిరిలో చదివితే సగళమైన వచనంవలె బాచకానికి వీలు లేదు; మర్మము గ్రహించి చదివితే మజా ఉండేది. మిత్రుల ఉపదేశమువల్ల రచన విధానాన్ని విడిచిపెట్టాను.

సామాన్యంగా వృత్తపాదాలను మడత వేసి ఒకటి రెండు చేసి, అచ్చు వెయ్యడం అలవాటు. ఆ లెక్కన నాలుగు పాదాలు ఎనిమిది అవుతవి. శ్రీ ముద్దుకృష్ణ వైతాళికులు అనే కావ్యసందోహంలో వృత్తము ఆరుపాదాలుగా అచ్చొత్తించాడు. శ్రీ కవికొండల వెంకటరావు వృత్తము బహుపాదాలుగా ముద్రించినాడు.

సంస్కృతవృత్తము రెండు రెళ్ళు నాలుగు పాదాలుగా ఉంటుంది. ఆంధ్ర లాక్షణికులు సంస్కృత ఛందోమార్గప్రకారం తెలుగు పద్యానికి నాలుగు పాదాలు విధించారు. న్యాయతః పాద పరిగణనకన్న వాక్యధారను బట్టి గతినియమము కర్తవ్యమని శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారు అన్నారు. శ్రీ గిడుగు సీతాపతి మతము కూడా అటువంటిదే. కాబట్టి పద్యాన్ని నాలుగుకాళ్ళ మంచము చేయు నక్కర లేదనీ, శ్రీ కవికొండల వెంకటరాయ కవివలె కావలసినంత పంక్తివిభాగము విధించవలెననీ కొందరు పండితుల భావము. Dadaists అనే చిత్రకవులు ఈ పద్ధతి అవలంబించారు

౨

భారతీయ కవులకు భక్తి ఉగ్గుపాలతో పెట్టిందనే చెప్పవచ్చు. మహాకవుల మొదలు మామూలు కవులవరకూ అందరూ యత్కించిత్ భగవన్నుతి చేసినవారే. మహా మహాత్ముల మాట ఏమో కాని మానవ సామాన్య హృదయం ప్రార్థనాశీల మనే ప్రాజ్ఞులు నిర్వచించారు. ఆర్తి కలిగినప్పుడు భగవత్ప్రార్థన పరిపాటే. ఆర్తభక్తికి అగ్రస్థానం లేదు, కాని తర్వాత స్థానం ఉన్నది. సుఖసమయంలోకూడా ఈశ్వరప్రార్థన చేసేవారు ఎందరో ఉన్నారు. "ప్రార్థనా బలంచేత పర్వతాలుకూడా కదులుతవి" అన్నారు భక్తులు.

దుఃఖత్రయపరిచిత అభిభూతమైన ఈలోకానికి ఏకైకగమ్యం ఈశ్వరుడే. "నృణా మేకో గమ్య స్త్వమసి పయసా మర్ణవ ఇవ." కవులూ, భక్తులూ తమ కష్టాలను భగవంతునికే విన్నవిస్తారు. లోకులకు విసుగు పుట్టుతుంది, కాని వినడానికి విశ్వేశ్వరునికి విసుగు లేదు.

భగవదంశ ఉండడంచేతనే గ్రామగ్రామంలో ప్రతిష్ఠితులైన దేవతలను సంబోధించి మన ఆంధ్రకవులు అనేక శతకాలు చెప్పినారు. అది కూడా ఉపాసనాభేదమే. ఉపాసన ఉన్నప్పుడు రూపకల్పన సహజము. తమయిష్టానుసారంగా, రుచిభేదాన్ని బట్టి భగవత్తత్త్వాన్ని స్త్రీమూర్తిగానో, పురుషాకృతి గానో, మానుషేతరము గానో భావించి భక్తాదులు ప్రణుతిస్తారు. కొంతమంది నిరాకార తత్త్వాన్నే ఉపాసిస్తారు. ఏప్రకారముగా భగవన్నుతి చేసినా బాగు పడవచ్చును. "ఏకం సత్, విప్రా బహుధా వదన్తి."

ఈ కావ్యకర్తలు భక్తిభావముతో కవిత్వము చెప్పినారు. వీరి 'ఏకాంత సేవ' మధురము; 'బృందావనము' లో కృష్ణభక్తి వాసింది. ఈ నవీన భావసంకీర్తనములో భావానికి ప్రాధాన్యము. "శబ్ద యమకాలంకార విస్ఫూర్తి

గౌరవి శుభాంగి" అని తన కవితాకన్యను గురించి పార్వతీశ్వరులే పలికారు. రవీంద్రకవి "ఆమార్ ఏ గాన్ ఛేడేఛే తార్ సకల అలంకార్; నా పాట తన అలంకారాలన్నింటినీ త్యజిస్తున్నది" అన్నాడు.

గోష్ఠీప్రార్థనలలో ఉపన్యాసావసరంలో ఇందులో ఏపద్యమయినా సామాన్యోక్తివలె ఉచ్చరించి, ఉపన్యాసము చేయవచ్చు. అటువంటి ఉద్దేశముతోనే ఈ కావ్యరచన సాగిందనిపిస్తుంది.

ఆర్ద్రహృదయాలకూ, భక్తమానసాలకూ ఈ భావసంకీర్తన కావ్యము ప్రమోదదాయకమవుతుందని ఆశయము.

ఇతి శివమ్!

తల్లావఝ్ఝల శివశంకర శాస్త్రి

సాహితీ సమితి
నవంబరు ౧౯౮3

